మహోన్నతుడు

మధురాంతకం రాజారాం

పోటీ ముగిసింది. బహుమతులివ్వడమే తరువాయి. తమలో తాము చర్చించుకోడం కోసం జడ్జీలు తెర వెనక్కి వెళ్ళిపోయి అయిదు నిమిషాలైంది. బహుమతుల నిర్ణయంలో న్యాయనిర్ణేతల కెదురై వున్న గడ్డు సమస్య ఎలాంటిదో ప్రేక్షకులు గుర్తించే వున్నారు. పోటీకి కాస్త ఎక్కువ సంఖ్యలోనే నాటికలు వచ్చాయి. పాల్గొన్న నాటికల్లో కనీసం ఏడెనిమిదైనా ప్రేక్షకుల హృదయాలను చూరగొన్నాయి. కానీ ఆహార్యానికనీ, సంగీతానికనీ, సెట్టింగులకనీ, సామూహిక సంఘటనకనీ యిలా విభజించి వేర్వేరు అంశాల క్రింద మార్కులు వేసుకుంటూ

యించడంలో కష్టమేమీ లేదు. కానీ వచ్చిన చిక్కల్లా "ఉత్తమ నటుడి" దగ్గరే వచ్చింది. "అర్ధరాత్రి అతిథి"లో "రామారావు" పాత్రధారి ఓ ప్రముఖ సినిమా నటుడిని తలపిస్తూ నటించాడు. "శృంగార సత్రం" లో చిదానందం నటనని చూస్తుంటే బళ్ళారి రాఘవ మళ్ళీ భూలోకంలోకి దిగి వచ్చినట్టు తోచింది. "మిఠాయి బండి" నాటికలో నైతే ఆ హీరో వేషధారి ఒక గంట సేపట్లో నవరసాలనూ కుమ్మరించి ప్రేక్షకుల తలలు దిమ్మెక్కి పోయేటట్టుగా చేశాడు. వీళ్లలో ఉత్తమ నటుడి బహుమతి ఎవరికొస్తుంది? పోటీ యింత ప్రబలంగా వుండగా జడ్జీలకు మాత్రం ఎలా ఏకాభిప్రాయం కుదురుతుంది, అన్న ఆలోచనలతో సభ "మంత్ర కట్టు"కు లోనైనట్టుగా నిశ్చలంగావుంది.

ప్రేక్షకుల్లో వరుసగా పందొమ్మిది నాటికలూ చూచినవాళ్ళు కొందరున్నారు. వాళ్ళల్లో కొందరు ఉత్తమనటుడి పైన పైపందాలు గూడా వేసుకొని నిర్ణయాల ప్రకటన కోసం కొండంత కుతూహలంతో వేచి వున్నారు.

జరిగిపోయిన నాటికలకు, జరగబోతున్న బహుమతుల ప్రదానానికీ మధ్య రంగస్థలం తాత్కాలికంగా ఒక ఉపన్యాస వేదికగా మారిపోయింది చీఫ్‌గెస్టుగా విచ్చేసిన మునిసిపల్ చేర్మన్ శ్రీమన్నా అన్న అంశంపైన ఉపన్యసించబోతు న్నారు. "మహాజనులారా! నమస్కారం. 'కావ్యేషు నాటకం రమ్య' మన్నారు పెద్దలు ఎందువల్ల నంటారు? మన పెద్దలు ఉబుసుపోకకనీ అల్లాటప్పాగా మాట్లాడేవాళ్ళుకారు. ఒకటికి పదిసార్లు ఆలోచించి, అందులోని నిజాన్ని పూర్తిగా అనుభవంలోకి తెచ్చుకున్న తర్వాతనే అలాంటి మాట సెలవిచ్చి వుంటారు. నేను లక్షణ గ్రంథాలు చదివినవాణ్ణిగాను. ఐనా నా చేతనైనంతలో నాటకకళను గురించి నేనూ కొన్ని వూహాలు చేసి చూచాను..." సభలో సంచలనం.

"నాకు తెలుసు. నేను పదవిచేత మునిసిపల్ చేర్మన్ని అయిపోయాను. వృత్తిచేత వ్యాపారస్థుణ్ణి అయిపోయాను. ఈ వ్యాసంగాల కూపంలో నేనొక మండూకంలా బ్రతుకుతూ వుంటానని మీరనుకుంటారు. అయ్యా! మీరు పొరబడుతున్నారు. మానవుడు కడుపుకోసం చేసే పనులు చాలా వుంటాయి. వాటి సంగతలావుంచి మనసుకు ఆనందం కలిగించే వాటికోసం అతడు మరొకవైపున అన్వేషణ సాగిస్తూనే వుంటాడు. సరే, ఇప్పుడా గొడవంతా ఎందుకులెండి! అసలు విషయంలోకే వస్తాను. జీవితం బింబమైతే నాటకం ప్రతిబింబంలాంటిదని నా ఊహ బింబమంటే ప్రతిబింబ

మెప్పుడూ అందంగానూ, ఆహ్లాదకరం గానూ వుంటుందని నా నమ్మకం. చిన్న దృష్టాంతం ఒకటి మనవిచేస్తాను. మనం ప్రతిరోజూ చూచే మామూలు దృశ్యం ఒకటి వుందనుకోండి! దాన్ని మీరొకసారి ఫోటోతీసి చూచుకోండి. ఫోటోలో అదెంతో శోభాయమానంగా వున్నట్టు మీకు తోస్తుంది. అంతెందుకు? ఎండలోకి వెళ్ళి నిల్చుంటే కొంత సేపటికి మనకు చెమట పడుతుంది. మరికొంత సేపటకి తల తిరుగుతుంది. నీడలోకి పారిపోవా లనిపిస్తుంది. అదే వెన్నెల్లోకి వెళ్ళి చూడండి. ప్రాణాల కెంతో హాయిగా వుంటుంది. అసలైన వస్తువుకు, అను కరణకువున్న తేడా అదే! ఒకసారి మా యింట్లో ఏం జరిగిందను కున్నారు?......"

ఈ సందర్భంలో ఉలికిపడిన వ్యక్తి శ్రీమతి శారదా శ్రీమన్నారాయణ. తన చేతి మీదుగా బహూమతులందించే పనిపైన భర్తతో బాటు సభకు విచ్చేసిన శారదా దేవి తటాలున తల పైకెత్తి భర్తవైపు చూచింది. కొంపదీసి ఈయన తన చాప క్రిందికి నీళ్ళు తేబోవడం లేదుగదా అన్న సందేహం ఆమె చూపుల్లో తారట్లాడుతోంది. చెప్పనా అన్నట్టు సాభిప్రాయంగా భార్యవైపొకసారి చూచి శ్రీమన్నారాయణ గారు మళ్ళీ కొనసాగించారు.

"ఓ రోజు వుదయం పదిగంట లప్పుడు ఒక బిచ్చగాడు మాయింటి ముందరికి వచ్చి నిల్చున్నాడు. "అమ్మా, పట్టెడన్నం పెట్టు తల్లీ!" అంటూ పది యిండ్లకు వినిపించేటట్టు కేకపెట్టాడు. మాయింట్లో సాధారణంగా కొంత ఆల స్యంగానే భోజనా లౌతూవుంటాయి. గంట పదైతే అప్పటికింక టిఫిన్లేవీ మిగిలివుండవు. పాపం, మా ఆవిడ మాత్రం ఏంచేస్తుంది? "వెళ్ళిరాబాబూ! కాసేపు తాళిరా!" అంటూ సానునయం గానే చెప్పిచూచింది. "ఒరే బాబూ! మా యింట్లో ఒంటిగంటకు గానీ అన్నాలు కావు. అప్పుడొచ్చావంటే తప్పకుండా పెడతాను ఇప్పుడెంతగా అరిచినా, గీ పెట్టుకున్నా పెట్టడాని కేమీలేదు" అంటూ వివరణగూడా చేసి నచ్చజెప్ప జూచింది. కానీ ఏం లాభం? వాడు వినిపించుకోడే! పెద్దపెట్టున ఆక్రోశం చేస్తూ గోలపెట్ట సాగాడు. మా ఆవిడకు పట్టరానంత కోపం వచ్చిందంటే నమ్మండి! "చెవులు కోసిన పందిలా అలా నోరుచించుకుంటా వెందుకురా అడగాడిదా! చెబుతుంటే నీక్కాదూ? ఛీఛీ! వెళ్ళు..." అంటూ తలుపు దబాలున మూసేసింది. ఇంత పెద్దసభలో చెప్పడానికి సంఘటనలో ఏముందని మీరనుకోవచ్చు. పూర్తిగా వినాలి మరి! మాయింట్లో లీల అని ఓ అమ్మాయి, రామం అనే ఓ కుర్రాడు వున్నారు. మా పిల్లలే లేండి, ఎవరో

కాదు! ఆరోజు సాయంకాలం వాళ్ళిద్దరూ కలిసి ఒక సరిక్రొత్త ఆట ప్రారంభిం చేశారు. రామం అనే కుర్రకుంక మేము ఒళ్ళు తుడుచుకునే తువాలా తలకు చుట్టు కున్నాడు. ఎక్కడిదో ఒక గోగుపుల్ల సంపాదించి చేత బట్టుకున్నాడు. చెట్టు కావలనిలబడి "అమ్మా! పట్టెడన్నం పెట్టు తల్లీ!" అంటూ తన పోర్షన్ ఒప్పగించడం ప్రారంభించాడు. "ఇంకా కాలేదులే! కాసేపు తాళిరా" అంటూ మా లీలగూడా తనపాత్రను తాను పోషించు కోడం మొదలెట్టింది. మేమిద్దరమున్నూ వాళ్ళ ఆగడాన్ని చూస్తూ కిటికీ దగ్గర నిల్చున్నాం. "పోరా అడ్డగాడిదా" అంటూ లీల విజృంభించినప్పుడు చూడాలి. మా ఆవిడ ఒకటే నవ్వు..."

సభలో నవ్వులు చెలరేగాయి. శారదా దేవి పెదవులపైన గూడా లీలగా ఓ దర హాసం మెరిసివుండవలసింది. అలాంటి దేమీ కానరాలేదు. ఆశ్చర్య విభ్రమంలో మునిగిపోయినట్టుగా ఆమె ఛ త్రముఖం వైపు తదేకదృష్టితో చూస్తూవుంది...

ఇంతవరకు చెప్పిందంతా ఉపోద్ఘాతం కాగా, యిప్పుడు సంగీత సాహిత్యాది లలితకళ లన్నింటికి సంగమస్థానమైన నాటకకళను గురించి శ్రీమన్నారాయణ గారు గంభీరంగా ఉపన్యసించుకుపోతు న్నారు. శారదాదేవి ధ్యాస మాత్రం ఆ ప్రసంగంపైన లేదు. ఎదురుట టేబిలు పైన రోలింగు షీల్డులు. కప్పులు దీప కాంతుల్లో ప్రతిబింబాలు క్రుమ్మరిస్తూ తళ తళ లాడిపోతున్నాయి. శారదాదేవి కొక అనుమానం కలిగింది. చూడ్డానికైతే బాగున్నాయి గానీ నిత్యజీవితంలో మానవుడికి వీటివల్ల ఉపయోగం ఏదీ వుండదేమో! పూర్వకాలంలో యుద్ధ వీరులు 'డాల్‌కత్తులు' మెరయగా యుద్ధా లకు బయల్దేరేవారట! ఆ డాళ్ళలావుంటా యని చెప్పడానికి మాత్రమే ఈ రోలింగు షీల్డులు పనికొచ్చేటట్టున్నాయి. వీటికన్నా కొంతలో కొంత కప్పులే నయం! వాటిని వంటగదిలో వుంచుకుని మిరియాలు, జీలకర్ర, ఆవాల లాంటి సామాన్లయినా పోసిపెట్టుకోవచ్చు...

శారదాదేవి పెదవులపైన ఓ చిరు నవ్వు తొంగిచూచింది

ఆలోగా శ్రీమన్నారాయణగారి ఉప న్యాసం ఉప్పెనలా పొంగి, అంతలో ఉపశమించి, ఉపసంహార వాక్యాల దగ్గరికి వచ్చేసింది దేశాభివృద్ధికి పరి శ్రమలు, నీటిపారుదల పథకాలు, విద్యా లయాలు, వైజ్ఞానిక పరిశోధనలు ఎంత అవసరమో, నాటక కళోద్ధరణగూడా అంతే అవసరమన్న విషయాన్ని శ్రీమ న్నారాయణగారు సభాసదులకు నచ్చజెప్ప గలిగారు. ఎర్రపెన్సిల్ చేతికి తీసుకుని ప్రతి జవాబు దగ్గర టిక్కుమార్కు కొట్టినట్టుగా, వక్తనోటినుంచి వచ్చిన ప్రతి వాక్యానికి శ్రోతలు తలలు పంకిస్తు న్నారు. శారదాదేవి విస్తుపోయింది.



ఘటనా ఘటనాశక్తి అనేదంతా మాటల్లోనే వుండేటట్టుంది. మాటలు నేర్చిన వారికి, మీదుమిక్కిలి ఆ మాటల్ని ఎప్పుడు, ఎక్కడ, ఎలా ప్రయోగించాలో తెలిసినవాడికి ఈ లోకంలో అసాధ్యమైన పని ఏదీ వుండదు.

పెద్దపెట్టున మ్రోగిన కరతాళ ధ్వనులతో శ్రీమన్నారాయణగారి ఉపన్యాసం ముగింపుకు వచ్చింది.

ఇప్పుడు బహుమతుల ప్రదానం జరుగుతుందని ప్రకటించి శ్రీమన్నారాయణగారు కుర్చీలో కూచోబోతుండగా, తెరవెనుకనుంచీ ఓ వ్యక్తి రంగంపైకి దూసుకొచ్చాడు. ఆయన చెవిలో అతదేదో వర్తమానం చేరవేసేసరికి వెంటనే యింకొక ప్రకటన వెలువడింది. జడ్జీలొకనిర్ణయానికి రావడానికి మరికొన్ని నిమిషాల వ్యవధి కావలసివుంది. అంతవరకూ ఓ గాయకుడు తన గానామృతంతో శ్రోతలకు విందు చేస్తాడు. సభాసదులందరూ శ్రద్ధగా వినవలసిందిగా ప్రార్థితులు.

మరుక్షణమే మైకుముందు నిలబడి ఆ గాయకుడెవరో పాటందుకున్నాడు.

పాటకు ప్రసంగానికి ఒక తేడావుంది. ప్రసంగం వింటూ ఆలోచించుకోడం సాధ్యంకాదు. ఎక్కడికక్కడే ఆలోచన చెదిరిపోతుంది. పాటలో ఆ చిక్కులేదు. ఒకవైపు పాట వింటూ, మరొకవైపు నింపాదిగా ఆలోచనలో నిమగ్నం కావచ్చు.

శారదాదేవి ఆలోచన లిప్పుడు వర్తమాన విషయాలపైన లేవు.

* * *

ఎన్నయిన క్రొత్తలో తాను చాలా సంబరపడిపోయింది.

పురాణదంపతుల్లాంటి అత్తమామలు. లంకంత సంసారం. తల్లిదండ్రుల కీయ నొక్కడే కొడుకు. అయినా పరవాలేదు. ఆ కొరత తీరడానికి నలుగురు అక్క చెల్లెళ్ళున్నారు. అందు ఇద్దరు అప్ప చెల్లెళ్ల ఆదేవూళ్ళో వున్నారు. ఆ మూడు కాపురాలు ఒక్కటే సంసారంగా కలిసి వున్నట్టుంటాయి. ఆ యిల్లెప్పుడూ మనుషులతో సందడిగా వుంటుంది. అత్తమామల ఆదరణ, ఆడపడుచుల ఆప్యాయత, ఆ పల్లెటూరివారి అమాయకత్వం చూస్తుంటే అదొక ప్రత్యేక ప్రపంచంలోకి వచ్చినట్టుండేది.

కానీ తనకా ఆనందం దక్కడమల్లా ఒకటి రెండు నెలలు మాత్రమే!

"చూడు శారదా!" అన్నారాయన. "నువ్విప్పటికే ఈ వూబిలో గొంతుబంటి దాకా కూరుకపోయావు. ఇదేం లాభం లేదు. ఇలాగైతే వీళ్ళు నిన్ను మేసేస్తారు!"

"అబ్బే, ఎందుకండీ! వీళ్ళందరూ మంచివాళ్ళలాగానే కనిపిస్తున్నారే!"

"మనకొచ్చిపడే బెడదలన్నీ మంచి వాళ్ళతోనే! మంచివాళ్ళేమనుకుంటారో తెలుసా? వాళ్ళలాగా మనమూ త్యాగాలు చెయ్యాలనుకుంటారు. ఎవరి ఆనందానికి వారు దారి వెతుక్కోడం వాళ్ళ దృష్టిలో తప్పు. మనం ఎంతోకాలం ఇక్కడుంటా మనుకోవద్దు. మన మకాం టౌన్లోనే! అదీ తొందరగానే..."

"టౌనయితే మాత్రం ఎంత దూర మండీ! పాతిక మైళ్ళేగదా! మమకారా లున్న వాళ్ళకు అదొక పెద్ద దూరమా?"

"మమకారాలు! పూర్ సెంటి మెంట్సు! అవంటే నాకు చెడ్డరోత. కన్నబిడ్డను తల్లిదండ్రులు పెంచి పెద్ద జేయడంలో వున్న గొప్పేమిటో నా కర్థంగాదు. ఎంతో కొంత ఖర్చుపెట్టి ఈ అక్కచెల్లెళ్ళ కందరికీ పెళ్ళిళ్ళు చేసేశాం గదా! పీ క్లీ యింటిచుట్టూ బారులు కట్టుకుని తిరగడమెందుకో నాకు బోధ పడదు. నువ్వేమైనా చెప్పు శారదా! వీళ్ళు మనల్ని జలగల్లా పీల్చి పిప్పి జేయడానికి నేనొప్పుకోను..."

ఆశ్చర్యమేమిటంటే ఈయనకు తన బంధువులపట్ల యింతటి వైముఖ్యం వున్నట్టు తన కప్పటివరకూ చూచాయగానైనా తెలిసిందిగాదు.

కొడుకుగా,తమ్ముడుగా, బావమరిదిగా మేనమామగా, ఈయన ఎవరెవరి దగ్గర ఎలా నడుచుకోవాలో అలాగే నడుచు కోవడం తాను గమనించింది. పలకరింపులు, పరామర్శలు, పరిహాసాలు ఏవే మోతాదులో వుండాలో, ఆ మోతాదులోనే వున్నాయి.

కంటికి కనిపించేది మాత్రమే నిజ మనుకుంటాం. కంటికి కనిపించని నిజం గూడా చాలా వుంటుందన్నమాట!

అయినా ఈ పరిస్థితుల్లో తాను చేయ గలిగిందేముంది? తానేమో ఆగంతకు రాలు. కొత్త పరిస్థితులలోకి, పరిసరాల లోకి యిమిడిపోవడానికి ప్రయత్నించ డమే తన విధి. పెళ్ళయి యిక్కడికి వచ్చినప్పుడు యిక మీదట తన స్థిర నివాసం యిదేననుకుంది. కాదని ఇప్పుడు భర్తమాటలద్వారా తేలిపోయింది.

కానీ ఇందులో తన దోషమేమీ లేదన్న సంతృప్తి ఒకటుండేది. అది గూడా చాలాకాలం నిలవలేదు.

"ఏమమ్మా శారదా! ఈ పల్లెటూరి సంసారం నీకు సరిపడటంలేదటగా! మీ ఆడపడుచులు చెప్పుకుంటూ వుండగా విన్నాన్లే! పట్నానికి వెళ్ళిపోయే వుద్దేశంలో వున్నారట, నిజమేనా?" అంటూ ఓ పొరుగింటి యిల్లాలు ఆరా తీయ జూచేసరికి తనకు తల దిమ్మెక్కి పోయింది.

ఇలా ఒక అపోహ రగులుకుంటూ వుందని చెబితే ఈయన ఆ విషయాన్ని చాలా తేలిగ్గా తీసుకున్నారు. "అప్పుడే ఏంచూశావులే వీళ్ళ కుళ్ళుబుద్ధులు! ఈ రొంపిలోపడి అఘోరించకుండా మనం వెళ్ళిపోతున్నామనే వీళ్ళ బాధ! నీకెందుకూ, నువ్వూరుకో" అన్నారు.

తీరా కాపురాన్ని పట్టణానికి తరలించిన నాటికి ఆపల్లెటూరి వాళ్ళల్లో తనపట్ల సద్భావమనేది బొత్తిగా లేకుండా పోయింది.

ఒక రాకాసి. అది మానవరూప మెత్తింది. ఒక అయినింటి ఆడపడుచు వేషంలో కదిలివచ్చింది. రూపం, చదువు, డబ్బు మొదలైన హంగులన్నీ చూచి ఓ యువకుణ్ణి వరించింది. పెళ్ళి కాగానే భర్తనొక చిలకగా మార్చి ముంజేతిపై నకూచోబెట్టుకుని మటుమాయ మైపోయింది...ఆ పల్లెటూరి వారికి తానా రాకాసికన్నా మెరుగ్గా కనిపించివుండదు.

కానీ ఏమాట కామాటే చెప్పుకోవాలి. ఈయన పట్టణానికి మకాం మార్చడం భార్యను బాధించడానికి గాదు. ఇంకా మాట్లాడితే సుఖపెట్టడానికే!

ముచ్చటైన చిన్నమేడ. ఆరూ, పోరూలేని సంసారం. రేడియో, ఫాను, పట్టెమంచం, డైనింగు టేబిలు, ఇంకా బీరువాలు, సుఖాసనాలు, తివాచీలు, సర్వ సౌకర్య సమపేతమైన కాపురం దేనికీ కొదువలేదు. ఇంట్లో తానున్నట్టే కొట్లో ఎవరో గుమాస్తా లుండి అక్కడి పనులన్నీ సర్దుకపోతుండేవారు. నెలకో రెండు నెలలకో ఒకసారి ఈయన మాత్రం విధిగా స్వగ్రామానికి వెళ్ళొస్తుండేవారు. వెళ్ళడం దేనికి? తల్లిదండ్రుల్ని, బంధు వుల్ని చూచి రావడానికైనా కావచ్చు. పొలాల్ని కౌలుకుచేస్తున్న రైతులపైన అజమాయిషీ చేసిరావడానికైనా కావచ్చు. ఎవరికి తగినట్టుగా వాళ్ళూహించుకోడం జరిగేది.

ఆమధ్య అత్తగారివూరినుంచీ ఓ ముత్తయిదువ గవర్నమెంటు ఆసుపత్రి కంటూవచ్చి, వెదుక్కుంటూ యింటి కొచ్చింది.

సమయాని కీయన యింట్లో లేరు.

ఆవిడ చెప్పగా తెలిసింది. ఆ పల్లెటూరివాళ్ళకు తన రాకాసితనం మరింతగా బుజువై పోతూ వుందట! "నంగనాచి! మొగుణ్ణి ఎగరేసుకపోయిందేమో, టౌన్లో జండా నాటిందేమో! అదింక మన మొఖమెందుకు చూస్తుంది? ఎంతయినా వాడు మనబిడ్డ. అందుకనే అదెంతగా పగ్గం బిగబట్టినా యిలా ఏదో సాకుమీద వచ్చి మనల్ని చూచిపోతున్నాడు." అంటూ అత్తగారూ, ఆడపడుచులు తనను ఒకటే ఆడిపోసుకుంటున్నారట!

ఒకసారి "నేనుగూడా వస్తానండీ" అంటూ మారాంచేస్తే ఈయనేమన్నారు?

"అబ్బే, నువ్వెందుకు శారదా! నువ్వక్కడి కొస్తేవంటే నీ వెంటపడి యిక్కడికి రావడానికొక పదిమందైనా తయారవుతారు. వచ్చే నురువేలి, పోయే మరువేలి. ఇక దీనికి తెరపివుండదు. మంచిదానివి కదూ, నేను వెళ్ళొస్తానులే..."

ఇంటా బయటాగూడా తన సదుపాయాలు తన కమరగానే, ఈయన దృష్టి లోకంపైకి మళ్ళింది. పట్నంలో ఒకరుగా, యిద్దరుగా, పదిమందిగా, యింకా ఎక్కువగా స్నేహితుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. కొందరు వసారాలో కూర్చుని మాట్లాడి వెళ్ళిపోతూండేవారు మరికొందరు మేడపైకి వెళ్ళి గదిలో తిశాణా వేసే వాళ్ళు. వాళ్ళకు క్రిందినుంచీ బిస్కట్లు, కాఫీలు పంపుకోవలసివచ్చేది. హాల్లోకి ప్రవేశార్హత చాలా కొద్దిమందికి మాత్రమే! వీళ్ళకోసం ప్రత్యేకంగా హోటలునుంచి మనిషిని రప్పించి రుచి రుచిగా వంటలు చేయించవలసివచ్చేది.

అతిథులందరూ వెళ్ళిపోయాక ఈయన చెప్పుకుంటూ వచ్చిన సంజాయిషీ తనకింకా బాగా జ్ఞాపకమే! "ఏం చేద్దాం శారదా! ఒప్పుకుంటాను. నీకు చిరాకుగానే వుండొచ్చు. కానీ ఏ వ్యాపారానికైనా పెట్టుబడి పెట్టాలిగదా! ఇదీ ఒక రకంగా పెట్టుబడేననుకో! ఏటొచ్చీ, యిది బాగా లాభసాటి వ్యాపారంలే! చూస్తూవుండు నీకే తెలిసొస్తుంది..."

కౌన్సిలర్‌గా పోటీచేసి గెలిచిన తర్వాతగానీ ఆ మాటల్లోని అంతరార్థం తనకు సరిగ్గా బోధపడలేదు!

మునిసిపాలిటీ కార్యాలయంలో తరచుగా మీటింగులు జరుగుతుండేవి. చేర్మన్‌గారు, కౌన్సిలర్లు గంభీరమైన ఉపాన్యాసాలిస్తారు. వీధులు బాగుచెయ్యాలి. డ్రెయినేజి స్కీము పూర్తి కావాలి. మురికిపేటలస్థానంలో కొత్త కాలనీలు నిర్మించాలి. అంతపనీ జరిగే దాకా తమకు నిద్రపట్టదన్నంతగా, తిండి



గూడా సహించదన్నంతగా అక్కడ ఆదర్శాలు వల్లింపబడతాయి. చేర్మన్ గారు దేవుడిలాంటివాడని కౌన్సిలర్లు తెగ పొగిడేస్తూ వుంటారు. ఇదంతా బహిరంగంగా పదిమందిలోనూ జరిగే పని. మునిసిపాలిటీ అసలు స్వరూపం అవగతం కావాలంటే కౌన్సిలర్లు ఏకాంతంగా మాట్లాడుకునే మాటలు వినగలగాలి...

దుష్టాంగాన్ని ఛేదించి మిగిలిన శరీరాన్ని రక్షించాలని చెబుతుంటాము. ఐతే శరీరమంతాదుష్టమైనప్పుడు ఏంచేయాలో ఎవరూ చెప్పరు. మునిసిపాలిటీవ్యవహారాలను తలుచుకుంటే తనకలాగే అనిపిస్తుంది. అవినీతి అనేది ఒక వ్యక్తికి, ఒక హోదాకు పరిమితమై వున్నట్టులేదు. ఇది సర్వాంతర్యామిలా కనిపిస్తుంది. పాకీవాళ్ళు ప్రతియింటివాళ్ళదగ్గరా నెలనెలా నికరమైన మామూళ్ళు వసూలు చేస్తారు. మొదటితేదీనాటికి ముడుపు చేతిలో పడకపోతే వాళ్ళా యింటివైపు తిరిగిచూడరు. ఈ వసూళ్ళలో కొంత వాటా హెల్తుఆఫీసరుకు వెళుతుంది. కౌన్సిలర్లకు, కంట్రాక్టర్లకు మధ్య వున్నదిగూడా సరిగ్గా యిలాంటి లాలూచీయే! కౌన్సిలరు తనకు యిష్టమైన కంట్రాక్టరుకు దక్కిస్తాడు తాను తెరమరుగున వుండి పనిచేయిసాడు. ఆఫీసుకువెళ్ళి కూర్చుని బిల్లు పాసుచేయిస్తాడు. లాభంపైన తప్పితే పనిమీద ఎవరికీ నిఘా వుండదు. బిల్లు ప్యాసయ్యాక ఎవరి వాటా వాళ్ళు పంచుకుంటారు. ఆఫీసులో గుమాస్తాలు, పని తనిఖీచేసే సూపర్వాయిజర్లు, కౌన్సిలర్లు, కంట్రాక్టర్లు యిదంతా ఒక విషవలయం.

అయితే ఈ కపటనాటకం ఎంతకాలం కొనసాగుతుందన్నదే ప్రశ్న! ఇది బహుశా ఎవడెవడు ఎంతకాలం ప్రజల్ని మభ్యపెట్టగలడన్న విషయంపైన ఆధార పడివుంటుందేమో...

మొన్నటికి మొన్న ఈ నాటకాల పోటీకి సంబంధించిన వాళ్ళెవరో ఈయన్ని చూడ్డానికి వచ్చారు.

కుశలప్రశ్నలు, మర్యాదలు ముగిశాక వీళ్ళు వచ్చిన పనేమిటో మనవిచేశారు. ఈయన కొంతసేపు వెనకాడినట్టేవుండి, ఆపైన విధిలేనిపక్షంలో అంగీకరించి నట్టుగా అలాగే కానిమ్మన్నారు. అంత టితో వూరుకోలేదు. పెద్ద సినిమాహాలు నమూనాలో ప్రతి పట్టణానికి ఒక నాటక మందిరం వుండితీరాల్సిన ఆవశ్యకతను గురించి ముచ్చటించారు. ప్రతిజిల్లాలోను ఒకవెయ్యి నాటకసమాజాలయినా ఉండాలి. మొదట తాలూకాస్థాయిలో నాటకాలపోటీ జరగాలి. ఆ తరువాత జిల్లా స్థాయిలో నాటికలను ఎన్నికచేయాలి. అక్కడ గెలుపొందిన నాటికలు రాష్ట్ర ముఖ్య పట్టణంలో ప్రదర్శింపబడాలి... ఇలా తమ ఉదారాశయాల నెన్నింటినో కార్య కర్తలతో చర్చించారు.

సెలవు తీసుకుని వాళ్ళలా గడప దాటుకున్నారోలేదో, "శారదా" అంటూ పిలిచారు. హాల్లోకి వెళ్ళేసరికి విరగబడి నవ్వుతున్నారు.

"ఏమిటండీ! ఎందుకలా పిచ్చిపిచ్చిగా నవ్వుతున్నారు?" అంటూ తాను ప్రశ్నిం చింది.

"సరిగ్గాచెప్పావు శారదా! పిచ్చేమరి! ఎవరి పిచ్చి వాళ్ళకానందం కావడం సబబే! కానీ నేను మాత్రం అందరి పిచ్చి నా కానందమే ననుకోవాలి. ఎందు కంటావా? మునిసిపల్ చేర్మన్‌గా వుండాలిగదా! అందుకోసం..."

"ఐతే యింతసేపు మీరు మాట్లాడిం దంతా వట్టి వూకదంపుడే నంటారా?" అంటూ ఏస్తుపోయింది తాను.

"కాక మరేమిటనుకున్నావు! తిని కూర్చోలేక కొందరికేదైనా చేసేయాలని పిస్తుంది. అలాంటి వాళ్ళు కొందరు 'అయ్యా" బాబూ! మేము నాటికలు వేస్తాం! మీరు చూడండి' అంటూ హంగామా ప్రారంభిస్తారు. ఒకరికంటే పంగమాలిన వాళ్ళంకొక రెప్పుడూ వుంటారీలోకంలో! వాళ్ళెక్కడ నాట కాలన్నా హాజరైపోతారు. అందు మూలంగా పైసా చేతికొచ్చే పనేదీ వీళ్ళు చెయ్యలేరు! ఏంచేద్దాం చెప్పు! ఎంత లేదన్నా మనమూ వాళ్ళతో కలిసిమెలసి బ్రతుకుతున్నాం కదా! పైగా వాళ్ళతో పనివున్నవాళ్ళం గూడా అయిపోయామూ! తప్పదు మరి! మనలాంటి వాళ్ళంగూడా అప్పుడప్పుడు వాళ్ళపిచ్చినికాస్త తలకు వేసి ఫులుముకోవలసిందే..."

కాసేపాగి మళ్ళీ ఆయనే కొనసాగించారు.

"మనము అని ఎందుకంటున్నానో తెలుసా శారదా! ఇందులో నువ్వు గూడా వున్నావు..."

"అబ్బే, నేనెందుకండీ! మీరెళ్ళి ఇచ్చేయండి".

"అదేంమాట! బహుమతులివ్వవలసింది నువ్వేనట! నీ తరపునగూడా నేనే మాటయిచ్చేశాన్లే! నువ్వొస్తావు. ప్రయిజులిస్తావు..."

*   *   *

మైకు చేతికి దొరుకితే కొందరికి ఒక పట్టాన దాన్ని వదిలిపెట్టాలన్న బుద్ధి పుట్టదు. గాయకుడు వరుసగా మూడు పాటలు పాడి, ఎవరూ వారించకపోతే నాలుగోదిగూడా అందుకోడానికి సిద్ధంగా వున్నాడు.

అంతలో కార్యదర్శి సుడిగాలిలా తెర తొలగించుకుంటూ వచ్చి, అధ్యక్షులవారికొక సీలుచేసిన కవరు అందజేశాడు. వెనువెంటనే గాయకుణ్ణి ప్రక్కకు తప్పించి మైకులో ఒక అత్యవసర ప్రకటన వినిపించారు.

"జరుగుతున్న ఆలస్యానికి సభాసదులు మన్నించాలి. సీల్డు కవరు చించడానికి ముందుగా, ఈ పోటీలో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన పెద్దల్ని పరిచయం చెయ్యవలసి వుంది. దయచేసి యింకొక అయిదు నిముషాలవాటు ఓపిక వహించవలసిందని ప్రేక్షక మహాశయులకు ప్రార్థన..."

కానీ దేనికైనా ఒక హద్దుంటుంది. ఓపికవహించేస్థితిలో ఆ హాలు మరికొంచెం గాలి పూరిస్తే పగిలిపోవడానికి సిద్ధంగావున్న బెలూన్‌లా వుంది. ఎవరిదాకానో ఎందుకు, బహుమతులను అందజేయవలసివున్న శారదాదేవికి గూడా యిలా మరి కొంతసేపు వేచి ఉండడం సాధ్యమయ్యే పనిగా తోచడంలేదు. ఆమె చేతులు అప్రయత్నంగా ఉత్తమనటుడికి బహూకరించవలసివున్న వెండి కప్పుపైకి వెళ్ళాయి. దాని అందచందాలు పరీక్షిస్తున్నట్టుగా పైకెత్తి పట్టుకొని భర్తవైపు చూస్తూ ఆమె అనేసింది—"పోనీ, దీన్ని మీరే స్వీకరించగూడదటండీ?"

"నే...నేనా? భలే, భలే" పొట్ట చెక్కలయ్యేటట్టుగా నవ్వసాగారు శ్రీమన్నారాయణగారు.

ఆమాత్రం హాస్యసన్నివేశం కోసమే ఎదురు చూస్తున్నట్టుగా ప్రేక్షకులుగూడా రకరకాల నవ్వులు చిందిస్తూ శ్రీమన్నారాయణగారితో శ్రుతి కలిపారు.

నిశితోక్తికి, ఛలోక్తికి తేడా తెలియని వెర్రిమాలోకాన్ని చూచి శారదాదేవి తాను గూడా నవ్వసాగింది.